www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 24 జులై 2024
5
అన్నమయ్య



ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు : కమిషనర్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాంబాబు హెచ్చరించారు. మంగళ వారం మార్కెట్ పరిసర ప్రాంతాలలోని దుకా ణాలపై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ కవర్లు పట్టుకొని సీజ్ చేశారు. ఈ సందర్భంగా దుకాణ దారులతో ఆయన మాట్లాడుతూ సింగిల్ యూస్ ప్లాస్టిక్ కవర్లపై వారికి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ కవర్లు వాడటానికి ఇకమీదట స్వస్తి పలకాలని, లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిఇఇ ఈశ్వర్‌రెడ్డి, ఎన్విరాల్మెంట్ ఇంజినీర్ మల్లేశుడు, శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.


దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న కమిషనర్

మదనపల్లె మంటలపై దర్యాప్తు వేగవంతం

- రెవెన్యూ రికార్డులను జల్లెడ పడుతున్న అధికారులు
- రికార్డుల పరిశీలనలో డిఆర్‌ఒ, 5 బృందాలు
- సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుతున్న మండలాల రికార్డులు
- సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన స్పెషల్ సిఎస్ సిసోడియా, కలెక్టర్లు


సబ్ కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న స్పెషల్ సిఎస్ సిసోడియా, కలెక్టర్లు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసు పోలీసులు, రెవెన్యూ అధికారులు వేగవంతం చేశారు. కుట్రకోణంపై పోలీసులు ఇప్పటికే నిర్ధార ణకు వచ్చారు. ఫైళ్ల దహనంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన కీలక దస్త్రాలు, వివిధ రకాల భూము లకు చెందిన కీలక డాక్యుమెంట్లు కాల్చివేసిన సంగతి తెలిసిందే. ఈ సంఘటనను తీవ్రంగా పరిగ ణించిన ప్రభుత్వం పూర్తి స్థాయి సమగ్ర విచారణ చేపట్టి దోషులను పట్టుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిజిపి ద్వారకా తిరుమ లరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లను సోమవారం ప్రత్యేక హెలికాప్టర్‌లో మదనపల్లెకు పంపించారు. సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని నిశితంగా పరిశీలించిన డిజిపి అధికారుల నివేదిక మేరకు ఇది ప్రమాదం కాదని ఉద్దేశ పూర్వకంగా జరిగిన చర్య అని స్పష్టం చేశారు. 25 రకాల అంశాలకు చెందిన దస్త్రాలు కాలిపోయినట్లు నిర్ధారణకు వచ్చినట్లు కలెక్టర్ శ్రీధర్ చేకూరి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అధికారి (డిఆర్‌ఒ) సత్యనారాయణరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఐదు బృందాలకు చెందిన అధికారులు మంగళవారం ఉదయం నుంచి మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని 11 మండలాల్లో ఏప్రిల్ 4, 2022 నుంచి భూములకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు జరిగాయి, ఏ రికార్డులు ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లాయి, ఏయే భూములు వాస్తవ పొజీషన్ నుంచి సెటిల్ మెంట్ ల్యాండ్ కిందకు మారాయి తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి ఆధ్వర్యంలో రాయచోటి తహశీల్దారు జయన్న, నయాజ్ అహ్మద్ తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట మండలాల్లోని రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నారు. రాజంపేట ఆర్‌డిఒ మనోహర్‌రావు ఆధ్వర్యంలో రాజంపేట తహశీల్దారు ఇంబనాథన్, ఓబులవారిపల్లె తహ శీల్దారు శేషగిరిరావు మదనపల్లె, నిమ్మనపల్లె రికార్డు లను పరిశీలిస్తున్నారు. మదనపల్లె హెఎస్ఎస్ఎస్-1 అధికారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో పీలేరు తహశీల్దారు మహబూబ్‌బాష, గాలివీడు తహ శీల్దారు శ్రీనివాసులు పీలేరు, గాలివీడు మండ లాలకు చెందిన రికార్డులను పరిశీలిస్తున్నారు. హెచ్ఎస్ఎస్ఎస్-3 పీలేరుకు చెందిన అధికారి రమా ఆధ్వర్యంలో రైల్వేకోడూరు తహశీల్దారు శివరాముడు, రామాపురం తహశీల్దారు శ్రీని వాసులు రామసముద్రం, పెద్దమండ్యం మం డలాల రికార్డులను పరిశీలిస్తున్నారు. రాజం పేటకు చెందిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లీలా రాణి ఆధ్వర్యంలో వీరబల్లి తహశీల్దారు శ్రీని వాసులు, చిన్నమండెం తహశీల్దారు ఆనంద్ కుమార్ పిటిఎం, బి.కొత్తకోట మండలాల రికా ర్డులను పరిశీలిస్తున్నారు. ఏయే రికార్డులు తారు మారయ్యాయి, ఏ రికార్డులు కాలిపో యాయి సంబంధిత పూర్తి స్థాయి నివేదికను బుధవారం సాయంత్రానికి డిఆర్‌ఒ సత్యనారాయణరావు కలెక్టర్ నివేదించనున్నారు.



మదనపల్లె రైస్‌మిల్ మాధవరెడ్డి, నిమ్మనపల్లె జడ్‌పిటిసి భర్త వెంకటరమణారెడ్డి

సబ్ కలెక్టరేట్‌ను పరిశీలించిన స్పెషల్ సిఎస్ సిసోడియా

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఆదివారం రాత్రి జరిగిన దహనం ఘటనపై మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ (రెవెన్యూ) సిసోడియా పరిశీలించారు. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల కలెక్టర్లు శ్రీధర్ చామకూరి, సుమిత్ కుమార్, డాక్టర్ వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో జెఎండి చక్రధర్ బాబు, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు, తదితరులు స్పెషల్ సిఎస్‌తో పాటు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిసోడియా మాట్లాడుతూ సబ్ కలెక్టర్ కార్యాలయం తగలబెట్టడంపై గల కారణాలను పూర్తిస్థాయిలో విచారణ చేపడతామన్నారు. కారణాలను త్వరితగతిన గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాలిపోయిన ఫైళ్లను పరిశీలించి అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం చుట్టు ప్రక్కల, ఆర్‌డిఒ కార్యాలయపు వెలుపలి వైపు చుట్టూ ప్రహరీ గోడను పరిశీలించారు. కార్యక్రమంలో మదనపల్లె, రాయచోటి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పారదర్శకంగా దర్యాప్తు నిర్వహించాలి : సిపిఎం

మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసులో దర్యాప్తు పారదర్శకంగా నిర్వహించాలని, ఈ ఘటనతో సంబంధం ఉన్న ఏ ఒక్కరినీ వదిలిపెట్టకూడదని, అదే సందర్భంలో సంబంధం లేని వారిని బలి చేయకూడదని సిపిఎం అన్నమయ్య జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో దహనంపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కదిరి రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. నిందితులను వదలొద్దు, అమాయకులు బలి చేయొద్దు, సబ్ కలెక్టర్ కార్యాలయం దహనం సంఘటనపై సమగ్ర విచారణ జరిపించాలి, వాస్తవాలను ప్రజలకు బహిర్గతం చేయాలి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీలకమైన సెక్షన్ 22 ఎ విభాగం, తపాలా విభాగం, ఎఒ కార్యాలయ విభాగంలో ఉన్న ఫైళ్లు, డాక్యుమెంట్లు డేటా కాలి బూడిదయ్యాయని అన్నప్పుడే షార్ట్‌సర్క్యూట్‌కు అవకాశం లేదు.. మానవ ప్రేరేపిత సంఘటనగా సిపిఎం ప్రకటించిందని తెలిపారు. 22 ఎ విభాగం అధికారిగా ఉన్న గౌతమ్ తేజ ఆదివారమైనా రాత్రి 11 గంటల వరకు కార్యాలయంలోనే ఉండటం, కీలకమైన 22 ఎ విభాగం, తపాలా విభాగంలో మాత్రమే ఫైళ్లు, డాక్యుమెంట్లు పూర్తిగా కాలిపోవడంపై అనేక అనుమానాలు కలుగుతున్నాయని పేర్కొన్నారు. డిజిపి ద్వారకా తిరుమలరావు, సిఐడి చీఫ్ రవిశంకర్ అయన్నార్ హుటాహుటిన మదనపల్లెకి వచ్చినా ఏమి తేల్చకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. జరిగిన సంఘటనను రాజకీయాలకు ముడిపెట్టి లాభం పొందాలని అధికార పార్టీ అధికారులను బలి చేయడానికి పూనుకోవడం దుర్మార్గమన్నారు. డిజిపి అధికార పార్టీ నేతలను మాత్రమే కార్యాలయం లోపలికి తీసుకెళ్లి మంతనాలు జరపడం వలన సంఘటనతో సంబంధం లేని అధికారులను కూడా బలిచేస్తున్నట్లు ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. వైసిపి, టిడిపి నాయకులు కుమ్మక్కై భూములు కాజేసిన విషయం ప్రజలందరికీ తెలుసని, కార్యాలయం దహనం వెనుక రెండు పార్టీల నాయకులు ఉండే అవకాశం ఉందని విమర్శించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్లు, ఫర్నిచర్ కాలిపోయిన సంఘటనపై సమగ్రంగా దర్యాప్తు జరిపించి, సంఘటనతో సంబంధం ఉన్న అందరిని శిక్షించాలని, భూ బాధితులకు అండగా ఉండాలని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు హరిశర్మ, నాగరాజు, ప్రభాకర్, రమణ, సురేంద్ర పాల్గొన్నారు.



కదిరి రోడ్డులో రాస్తోరోకో చేస్తున్న సిపిఎం నాయకులు


మాధవరెడ్డి ఇంట్లో తనిఖీలు జరుగుతుండగా బందోబస్తుగా ఉన్న పోలీసులు

'పెద్దిరెడ్డి' అనుచరుల ఇళ్లలో సోదాలు

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైల్స్ దహనం కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. కుట్ర కోణంపై ఇప్పటికే నిర్ధరణకు వచ్చిన పోలీసులు మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రధాన అనుచరులు రైస్‌మిల్ మాధవరెడ్డి, నిమ్మనపల్లె జడ్‌పిటిసి భర్త వెంకట రమణారెడ్డిలను అదుపులోకి తీసుకున్నారు. మాధవరెడ్డి ఘటన జరగడానికి 10 రోజుల ముందు నుంచి క్రమం తప్పకుండా మాధవరెడ్డి సబ్ కలెక్టర్ కార్యాలయానికి వెళ్లినట్టు గుర్తించారు. ఫైల్స్ దహనం కేసులో అతని హస్తం ఉందని నిర్ధరించుకున్న పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పదిరోజుల పాటు వరుసగా సబ్ కలెక్టర్ కార్యాలయానికి ఎందుకు వచ్చారు? ఏయే దస్త్రాలకు సంబంధించి ఎవరెవరిని కలిశారనే వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు. మాధవరెడ్డి, వెంకటరమణారెడ్డిలు ఇద్దరూ పెద్దిరెడ్డికి బినామీలుగా తెలుస్తోంది. వీరిరువురూ ఐదేళ్ల వైసిపి పాలనలో రూ.వందలకోట్లు విలువైన భూములు దోచుకోవడమే కాకుండా అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుంచి భూనష్టపరిహారం కింద రూ.కోట్లు కొల్లగొట్టినట్లు విచారణలో తేట తెల్లం అవుతోంది. రెవెన్యూ అధికారులు రైస్‌మిల్ మాధవరెడ్డి ఇంట్లో నుంచి కంప్యూటర్లు, హార్డ్ డిస్క్‌లు, కొన్ని కీలక డాక్యుమెంట్లను సబ్ కలెక్టర్ కార్యాలయానికి తరలించడంతో పాటు అతని ఇంట్లో సుమారు 20 మంది రెవెన్యూ సిబ్బంది విస్తృత తనిఖీలు చేస్తుండడం ఆరోపణలకు బలమిస్తోంది. సబ్ కలెక్టర్ కార్యాలయం అగ్నికి ఆహుతైన ఘటనలో పెద్ద ఎత్తున భూ కుంభకోణ ఆరోపణలు వస్తున్న మాధవరెడ్డి పాత్ర ఏమైనా ఉందా అన్న కోణంలో కూడా పోలీసులు విచారణ చేస్తున్నారు. కాగా గతంలో ఇక్కడ ఆర్‌డిఒగా పనిచేసిన మురళి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అత్యంత సన్నిహితుడుగా ముద్ర ఉంది. ఇటీవల బదిలీ అయిన హరిప్రసాద్ కూడా పెద్దిరెడ్డికి సన్నిహితంగా ఉండేవారని తెలిసింది. వీరిద్దరినీ సబ్ కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీధర్ చేకూరి, ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు విచారిస్తున్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించండి : డిపిఒ


కార్యదర్శులకు సూచనలిస్తున్న డిపిఒ ధనలక్ష్మి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పంచాయతీలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నమయ్య జిల్లా పంచాయతీ అధికారి ఎం.ధనలక్ష్మి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పంచాయతీలలో జరుగుతున్న పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. మంగళవారం మదనపల్లె మండలం, కొండామర్రిపల్లి పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా డిపిఒ ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో మార్పులు, వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. పారిశు ధ్యం లోపిస్తే డెంగీ, మలేరియా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు విజృంభించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీలలో ఎప్పటికప్పుడు పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కృషి చేయాలన్నారు. దోమల నివారణ మందులను తరచూ పిచికారి చేయాలని ఆదేశించారు. పంచాయతీలలో మెరుగైన పారిశుధ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి, అందులో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఛే..విదిలింపులే..!



- ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
- కొప్పర్తికి మౌలిక వసతులు
- వెనుకబడిన ప్రాంతాల నిధుల ప్రస్తావన
- రైల్వేలైన్ల ప్రస్తావన కరువు
- వేతన జీవులకూ నిరాశే

కేంద్ర బడ్జెట్ స్వల్పవిదిలింపులకే పరిమితమైంది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2024-25 పూర్తి స్థాయి బడ్జెట్‌ను మంగళవారం రూ.48.21 లక్షల కోట్లతో ప్రవేశపెట్టారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ రాష్ట్రంలోని కూటమి సర్కారుకు నిర్లక్ష్యానికి పూర్తి స్థాయి బడ్జెట్‌లో చోటు లభించలేదు. జిల్లాలో కూటమికి 11 మంది ఎమ్మెల్యేలను ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యం చేయడం విస్మయాన్ని కలిగిస్తోంది. కేవలం కొప్పర్తి పారిశ్రామికవాడకు మౌలిక వసతులు, వెనుకబడిన ప్రాంతాలకు నిధుల ప్రస్తావనతో సరిపెట్టింది. రాష్ట్ర విభజనచట్టంలోని ప్రధాన హామీ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు ఊసే కనిపించలేదు. రైల్వే బడ్జెట్‌లోనూ కడప-బెంగళూరు రైల్వేలైన్ సహా పెండింగ్ రైల్వే ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుల ప్రస్తావన చేయలేదు. వ్యవసాయానికి, మౌలిక వసతుల కల్పనకు మోస్తరు కేటాయిం పులు చేసింది. వేతన జీవులను నిరాశ పరిచింది. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు కేటాయించింది. దేశంలోని నిరుద్యోగులకు మూడు పథకాల ద్వారా నాలుగు కోట్ల ఉద్యోగాల కల్పించనున్నట్లు పేర్కొనడం గమనార్హం.

ప్రజాశక్తి- కడప ప్రతినిధి

కేంద్రంలో సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేసినప్పటికీ పెండింగ్ ప్రాజెక్టులకు కేటాయింపుల జాడే కనిపించలేదు. రాష్ట్ర విభజనచట్టంలోని హామీలైన ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, గనుల కేటాయింపు, కడప-బెంగళూరు, కడప-విజయవాడ వంటి రైల్వే ప్రాజె క్టులకు కేటాయింపులు చేయాల్సి ఉంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపు తీరులోనే రైల్వే బడ్జెట్ ప్రస్తావన చేసింది. 2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే హామీనే విస్మరించడం గమనార్హం. వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ.1.52 లక్షల కోట్లు, గ్రామీణాభివృద్ధికి రూ.2.66 లక్షల కోట్లు కేటాయించింది. గతేడాది వ్యవసాయాభివృద్ధికి రూ.1.32 లక్షల కేటాయింపులకు అదనంగా రూ.20 వేల కోట్లను జత పరిచింది. ఉమ్మడి జిల్లాలోని ఐదు లక్షల మంది రైతులకు ఆశించిన ప్రయోజనం లభించే అవకాశం లేదని చెప్పవచ్చు. వేతన జీవుల ఆదాయ పన్ను శ్లాబుల్లో ఎటువంటి మార్పులు చేయకపోవడం నిరాశను కలిగించింది. ఫలితంగా ఉమ్మడి జిల్లాలోని 32 వేల మంది ఉద్యోగులు, 22,800 మంది పెన్షనర్లకు రిక్తహస్తాన్ని చూపించింది. ఓటాన్ బడ్జెట్‌లో రైల్వే బడ్జెట్ రూ.2.55 కోట్లతో ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లకు టిడిపి ఎంపీల మద్ధతు అవసరమైన పరిస్థితుల్లో గుడ్డిలో మెల్ల చందంగా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల ప్రస్తావన చేసింది. ఫలితంగా జిల్లాకు రూ.50 కోట్ల చొప్పున నిధులు విడుదల చేయడానికి అవకాశం లభించింది. విశాఖ-చెన్నయ్ కారిడార్‌లో భాగంగా జిల్లా కేంద్రానికి సమీపంలోని కొప్పర్తి పారిశ్రామికవాడకు నీళ్లు, విద్యుత్, రోడ్లు, హైవేల ఏర్పాటుకు పరిమితం కావడం గమనార్హం. జిల్లాలోని పెండింగ్ రైల్వే ప్రాజెక్టులైన కడప-బెంగళూరు, కడప-విజయవాడ, ఓబులవారిపల్లి-కృష్ణపట్నం సివిల్ రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై అందరిదృష్టి నిలిచింది. రూ.మూడు లక్షల కోట్లతో మహిళా సంక్షే మానికి కేటాయింపులు చేసింది. వీరిలో తొమ్మిది కోట్ల మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు, అంగన్వాడీలు, ఆశా వర్కర్లకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చనుందో తెలియాల్సి ఉంది. దేశం లోని కోట్లాది మంది నిరుద్యోగులకు మూడు రకాల పథకాలను ప్రకటించింది. వీటి ద్వారా ఐదేళ్లలో నాలుగు కోట్ల ఉద్యోగాలను కల్పించనున్నట్లు ప్రకటించింది.

మోసకారి బడ్జెట్

కేంద్ర బడ్జెట్‌లో కడప-బెంగళూరు రైల్వేలైన్ ప్రస్తావన కనిపించలేదు. పోలవరం ప్రాజెక్టుకు సైతం నిధుల కేటాయింపుల అంశంలో దాటవేత దోరణి కనిపిస్తోంది. రాష్ట్రంలోని కూటమి సర్కారు బడ్జెట్‌లో ఆశించిన కేటాయింపులు చేయించడంలో విఫలమైంది. కడప ఉక్కు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు పూర్తి చేయాలి.

- శ్రీనివాసులు, సిపిఎం జిల్లా కార్యదర్శి, అన్నమయ్య జిల్లా.

కంటితుడుపు చర్యే..

వేతన జీవులపై ఆదాయం పన్ను తగ్గింపు చాలా స్వల్పం. అది కంటి తుడుపు చర్య మాత్రమే. ఎల్ఐసి పొదుపు మొత్తాలకు ప్రత్యేక సెక్షన్ కింద పన్ను రాయితీ ఇవ్వాలి. ఎల్ఐసి ప్రీమియంలపై జిఎస్‌టి తొలగించాలి. నూతన ఎంపీలు వేతన జీవుల తరపున, బీమా పాలసీదారుల తరపున పార్లమెంటులో మాట్లాడాలి.

- ఎ.రఘునాథ రెడ్డి, ఎల్ఐసి కడప డివిజన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి.

అరచేతిలో వైకుంఠం..

కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపించింది. ప్రత్యేక హోదా ప్రస్తావనే లేదు. విశాఖ మెట్రో రైలు, విజయవాడ మెట్రో రైలు ప్రస్థవనం లేదు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన బడ్జెట్ ద్వారా అద్భుతాలు ఏమీ జరగవు.

- తులసిరెడ్డి, పిసిసి మీడియా చైర్మన్

రాష్ట్రంలో అభివృద్ధి పరుగులు

చంద్రబాబు నాయుడు చాణక్యతకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన బడ్జెట్టే నిదర్శనం. రాష్ట్రంలో ఇకపై అభివృద్ధి పనులు పరుగులుపెడతాయి. రాజధాని అమరావతికి రూ15 వేల కోట్లు కేటాయించడం హర్షణీయం.

- చమర్తి జగన్‌మోహన్‌రాజు, టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు.

అంకెల గారడీయే!

అంకెల గారడినీ బడ్జెట్ తలపిస్తోంది. కూటమి సర్కారు నిధుల వరద ఏమైందో చెప్పాలి. కడప-బెంగళూరు, విజయవాడ రైల్వే ప్రాజెక్టు, కడప స్టీల్ ప్లాంట్ ఊసేలేదు. ఐదు దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మాటే లేదు.

- ఈశ్వరయ్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు.

కార్మిక వ్యతిరేక బడ్జెట్

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక బడ్జెట్. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్న కార్మికుల డిమాండ్ ప్రస్తావన లేదు. గతంలో పెంచుతామన్న వేతనాల ఊసేలేదు. గ్రామీణ ఉపాధికి బడ్జెట్ తగ్గించారు. కార్మిక వ్యతిరేక కోడుల రద్దు ప్రస్తావన లేదు.

- సి.హెచ్.చంద్రశేఖర్, సిఐటియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు.

మట్టి విగ్రహాలనే వినియోగించాలి

ప్రజాశక్తి-పీలేరు : వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించి కాలుష్యాన్ని నివారిద్దామని పీలేరు గ్రామపంచాయతీ కార్యదర్శి గురుమోహన్ తెలిపారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో వినాయకుడి విగ్రహాలు తయారుచేసే మూడు కేంద్రాలను తనిఖీ చేశామని, విగ్రహాల తయారీదారులతో సమావేశాన్ని కూడా నిర్వహించి పిఒపితో విగ్రహాలు తయారీ చేయవద్దని ఆదేశించినట్లు చెప్పారు. పిఒపితో తయారైన రంగుల విగ్రహాలు వినియోగించి నీరు, గాలిని కాలుష్యం చేయవద్దని సూచించారు.

డయేరియాను అంతం చేద్దాం

ప్రజాశక్తి-పీలేరు : పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తూ డయేరియా వంటి అంటూ వ్యాధులను అంతం చేద్దామని కోటపల్లి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రెడ్డి బాబురెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక కోటపల్లి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణంలో "స్టాప్ డయేరియా" అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందరర్భంగా విద్యార్థులకు డయేరియా లక్షణాలు, కారణాలు, నివారణ పద్ధతులను వివరించారు. అలాగే "స్టాప్ డయేరియా" ప్రచార ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమంలో హెడ్ మాస్టర్ రెడ్డిబాబురెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా కో-ఆర్డినేటర్లు రఘునాథరెడ్డి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

హోం మంత్రిని కలిసిన పుష్పావరద

ప్రజాశక్తి-పీలేరు : పీలేరుకు చెందిన తెలుగుదేశం పార్టీ మహిళా నేత పుష్పావరద మంగళవారం విజయవాడలో రాష్ట్ర హోం శాఖా మంత్రి వంగలపూడి అనితను కలిశారు. రాష్ట్రాన్ని వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారి అంతం కోసం తన కుమారుడు చైతన్య, రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు తన కుమార్తె రోహిణీ రాయ్ తయారు చేసిన ప్రణాళికలను హోం మంత్రికి అందజేసినట్లు పుష్పావరద తెలిపారు. తాము అందించిన ప్రాజెక్టులపై ఆమె ఆసక్తి కనబరిచారని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకోనున్నట్లు హోం మంత్రి చెప్పారని పుష్ప పేర్కొన్నారు.

కార్మిక సమస్యలపై శాసనసభలో చర్చించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : అసెంబ్లీ సమావేశాల్లో కార్మిక సమస్యలపై చర్చలు జరిపి, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేవిదంగా జిఒలు విడుదల చేయాలని ఎఐటియుసి మదనపల్లె పట్టణ కార్యదర్శి తిరుమల డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఎఐటియుఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం కార్మిక సమస్యలు పరిష్కారం చేయకుండా ఐదేళ్ల పాటు అలసత్వం వహించిందన్నారు. కనీస వేతనం, ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు చేయకుండా కార్మిక వర్గాన్ని మోసం చేశారని ఆరోపించారు. నేడు అధికారంలో ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం ఐదురోజుల పాటు జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో మొదటి రోజు, రెండవ రోజు కార్మిక సమస్యలపై చర్చ జరపలేదంటే కార్మిక వర్గం పట్ల చిత్తశుద్ధి ఏమాత్రం ఉందో కార్మిక వర్గం అంతా గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు దేవా, ముబారక్, రెడ్డెప్ప, వీరాంజనేయులు, రాము, కృష్ణప్ప, రాజు, చంద్ర, మల్లి, నరసమ్మ, రాధా, చిన్న రెడ్డప్ప పాల్గొన్నారు.



సచివాలయం తనిఖీ చేస్తున్న జడ్‌పి సిఇఒ గ్లోరియా

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి


- ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సిఇఒ గ్లోరియా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది చొరవ చూపాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ సిఇఒ పి.గ్లోరియా సూచించారు. మంగళవారం మదనపల్లె మండలం తట్టివారిపల్లె గ్రామ సచివాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అటెండెన్స్, మూవ్ మెంట్ రిజిస్టర్లు తనిఖీ చేశారు. సచివాలయం పంచాయతీ కార్యదర్శి వెంకటరమణతో తాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలు గురించి, ఇంజినీరింగ్ అసిస్టెంటుతో తాగునీటి పరీక్షలు, ఒహెచ్ఎస్ఆర్ క్లీనింగ్ తదితర అంశాలపై ఆరా తీశారు. సచివాలయం సిబ్బందిని సమయపాలన, సర్వీసెస్ గురించి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఇఒ పి.గ్లోరియా మాట్లాడుతూ ప్రజలకు సచివాలయ సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని తెలియజేశారు. విధులు పట్ల నిర్లక్ష్యం వహించరాదని హితవు పలికారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి భాను ప్రసాద్, ఎఒ రెడ్డెమ్మ, సీనియర్ సహాయకులు శ్రీధర్, జూనియర్ సహాయకులు రూపనాథ్ పాల్గొన్నారు.

ఉచిత కంటి పరీక్షలకు స్పందన

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : పట్టణంలోని దేవత నగర్‌లోని చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ మహాకార్య ఫౌండేషన్ సహకారంతో డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ కంటి వైద్యులు సందర్శించారు. మంగళవారం డాక్టర్ అగర్వాల్స్ ఐ హాస్పిటల్స్ వైద్యులు ఆనంద నిలయంలోని వృద్ధులకు ముత్తు ఆంగ్ల మాధ్యమ విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. భవిష్యత్తులోను చైతన్య స్వచ్ఛంద సేవాసంస్థ చిన్నారులకు, ఆనంద వృద్ధాశ్రమ వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు, కంటి వైద్య సదుపాయలు అందిస్తామని హామీ ఇచ్చారు. చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు ఎంపీ ఆనందన్ మాట్లాడుతూ విద్యార్థులకు, వృద్ధులకు ఉచిత కంటి పరీక్ష నిర్వహించిన డాక్టర్ అగర్వాల్ కంటి వైద్య నిపుణులను, సహకారం అందిం చిన మహాకార్య ఫౌండేషన్ నిర్వాహకులు పూర్ణిమకు జ్ఞాపికలు అందించి, శాలు వాతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ కోశాధికారి పట్నం గిరిజమ్మాల్, సంస్థ అడ్మిని స్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ జివిఎస్ బాబు, జనరల్ సెక్రెటరీ ఎ.కవిత రాణి, ముత్తు ఆంగ్ల మాధ్యమ పాఠశాల ఉపాధ్యాయులు, సేవా సంస్థ సిబ్బంది, చిన్నారులు, వృద్ధులు పాల్గొన్నారు.


విద్యార్థికి కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేస్తున్న నిర్వాహకులు

చిన్నపిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలలో 27వ తేదీ వరకు ఐదు సంవత్సరాల లోపు ఉన్న చిన్న పిల్లలకు ఆధార్ కార్డు నమోదు చేయడం జరుగుతుందని ఆధార్ సేవ కేంద్రం సురేష్ తెలిపారు. మంగళవారం పుల్లంపేట అంగన్వాడీ కేంద్రంలో చిన్న పిల్లలకు ఆధార్ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ మండలంలోని వివిధ అంగన్వాడీ కేంద్రాలలో సూపర్వైజర్లు ఇచ్చిన సలహాలకు అనుగుణంగా ఏ సెంటర్‌కు వెళ్లి నమోదు చేయాలో సూచిస్తే అక్కడ ఆధార్ నమోదు చేస్తామని చెప్పారు. ఒరిజినల్ పుట్టిన తేది ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, తల్లిదండ్రులలో ఎవరో ఒకరు వేలిముద్ర వేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిబిడియు జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.



ప్రదర్శన క్షేత్రాలను పరిశీలిస్తున్న సుమతి

కళాశాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దాం

ప్రజాశక్తి-కలికిరి

అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల అభివృద్ధి లక్ష్యంగా కలిసి పని చేద్దామని దక్షిణ మండల ప్రాంతీయ పరిశోధన సహసంచాలకులు డాక్టర్ వి.సుమతి అన్నారు. మంగళవారం ఆమె స్థానిక అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి మిశ్రమ పంటల క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలకు ఫెన్సింగ్ వేయాలని, బిల్డింగ్ పైన అదనపు తరగతి గదిల నిర్మాణానికి, బాలుర వసతి గృహ నిర్మాణానికి ప్రపోజల్ పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కళాశాల నూతన ప్రిన్సిపల్ సుబ్రహ్మణ్యం, మాజీ ప్రిన్సిపాల్ రాజేష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బాల నేరస్తులను గుర్తించడమే లక్ష్యం : జడ్జి

ప్రజాశక్తి-కడప

జైళ్లలో ఉన్న బాల నేరస్తులను గుర్తించి వారికి తగు న్యాయ సహాయం అందించడమే పాన్ ఇండియా ప్రచారం -2024 ముఖ్య ఉద్దేశమని సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలుర ప్రభుత్వ పరిశీలన గృహాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాన్ ఇండియా ప్రచారం -2024 కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా కడప, ప్రొద్దుటూరు, రాయచోటి, రాజంపేట, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల, కమలాపురం జైళ్లలో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంచామన్నారు. ఏవైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చు అన్నారు.

వైసిపి ప్రభుత్వ హయాంలోనే హత్యలు, భూ కబ్జాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

వైసిపి ప్రభుత్వంలోనే హత్యారాజకీయాలు, అక్రమ ఇసుక, ఖనిజా సంపద, భూ దందాలు, భూకబ్జాలు జరిగాయని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. మంగళవారం పాత బస్టాండ్‌లోని మన్సూరు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనపై విసిగి వేసారి చంద్రబాబు నాయుడు నాయకత్వం కావాలని ప్రజల కోరుకున్నారని చెప్పారు. అందుకే 164 సీట్లని కట్టబెట్టారని తెలిపారు. హోమ్ మంత్రి వివరణ ప్రకారం ప్రస్తుతం నాలుగు రాజకీయ హత్యలు జరిగితే వాటిలో మూడు టిడిపి కార్యకర్తలను హత్య చేశారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం, చంద్రబాబు నాయుడు నేరాలను, హత్యలు చేసే వారిపైన కఠినంగా ఉండాలని పోలీసులను అదేశించారని తెలిపారు. శాంతి భద్రతలుటిడిపి ప్రభుత్వంలో ఎప్పుడు అదుపులో ఉంటాయన్నారు. యువత వ్యక్తిగత దాడులు, హత్యలకు పోయి ప్రాణాలు తీసుకుని కుటుంబానికి అన్యాయం చేయకుండా పోలీస్, ప్రభుత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు.

కరాటేలో 'నారాయణ' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఇంటర్‌నేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలలో నారాయణ స్కూల్ (పకీరు పల్లె) విద్యార్థులు ప్రతిభ చాటారని ఎజిఎం చెన్నకేశవరాజు, ప్రిన్సిపల్ రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాదులోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 21న నిర్వహించారని తెలిపారు. కరాటే పోటీలలో 3 గోల్డ్, 3 సిల్వర్, 1 బ్రాంజ్ మెడల్ సాధించారని చెప్పారు. విద్యార్థులను ఏవో విజయ్, హై స్కూల్ డీన్ కృష్ణ, ఇన్చార్జి మల్లేశ్వరి, మనీషా, వినోద్ అభినందించారు.

అధైర్య పడొద్దు..అండగా ఉంటా

ప్రజాశక్తి-చెన్నూరు : కార్యకర్తలు, నాయకులు ఎవరు కూడా అధైర్య పడవద్దని, ప్రతి కార్యకర్త తన కుటుంబ సభ్యులేనని అందరికీ అందుబాటులో ఉంటూ, అండగా ఉంటానని మాజీ ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు, ఆయన మంగళవారం చెన్నూరులోని మైనార్టీ నాయకులు అబ్దుల్ రబ్ నివాసంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశం ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే కక్ష సాధింపుకు పాల్పడడమే కాకుండా, రాష్ట్రాన్ని రావణ కాష్టం చేస్తున్నారని విమర్శించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులే లక్ష్యంగా ఆస్తి నష్టం తోపాటు ప్రాణాలు సైతం తీస్తున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, వైసిపి మండల కన్వీనర్ జి.ఎన్ భాస్కర్ రెడ్డి, ఆర్‌విఎస్‌ఆర్ ముదిరెడ్డి రవిరెడ్డి, వైసిపి మహిళా నాయకురాలు భాగ్యమ్మ, చంద్ర పాల్గొన్నారు

మునగ పంటకు తెగుళ్లు.. రైతుల కంట కన్నీళ్లు

ప్రజాశక్తి-వీరబల్లి

మునగకాయలో ఉన్న ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతం మార్కెట్లో వీటికి విపరీతమైన డిమాండ్ ఏర్పడుతోంది. దానికి అనుగుణంగానే రైతులు వాణిజ్య తైలంలో మునగ సాగు చేపట్టి స్వల్ప కాలంలో అధిక లాభాలను ఆర్జిస్తున్నారు. మునగ సాగును రైతులు అన్ని రకాల నేలల్లో సాగు చేయవచ్చు. ఎక్కువగా నీరు నిలిచే పరిస్థితులను తట్టుకోలేదు. సాధారణంగా మునగ చెట్టు జనవరి నెలలో పూతకు వచ్చి, ఫిబ్రవరి మాసం నుంచి కాయ కోతకు వస్తుంది. కాబట్టి రైతులు మంచి దిగుబడిని సాధించేవారు. మండల వ్యాప్తంగా లక్షలు పెట్టుబడి పెట్టి మునగ సాగు చేసిన రైతులకు మునగ పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు అపారంగా నష్టపోయారు. మునగ పంటకు వాతావరణం అనుకూలించక తెగుళ్లు సోకడంతో మునగ ఆకు అంతా రాలిపోయి, పూత పిందె నిలబడట్లేదు. రైతులందరూ అధిక విస్తీర్ణంలో మునగ సాగు చేశారు. వాతావరణం అనుకూలించక నష్టపోయామని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నేను రెండు ఎకరాలలో మునగ సాగు చేశాను. ఆశించిన రీతిలో మంచి దిగుబడి వచ్చేది. తెగులు కారణంగా మొత్తం చెట్లన్నీ తెగులు బారిన పడ్డాయి. పొలం దగ్గరకి పోవాలంటే కష్టంగా ఉంది. మునగ చెట్లను చూస్తే చాలా బాధగా అనిపిస్తుంది. ప్రభుత్వం ఆదుకోవాలి.

-రామమోహన్,పెద్దివీడు, వీరబల్లి



తెగుళ్లు సోకి ఎండిపోయిన మునగ చెట్లు

నాలుగు ఎకరాలు సాగు చేశా



నాలుగు ఎకరాలు సాగు చేశాను. మొలక నాటి నప్పటి నుంచి ఇప్పటివరకు లక్షా యాభై వేలు వరకు ఖర్చయింది. వాతావరణ ప్రభావం వలన తెగులు సోకింది, మొత్తం చెట్లకు ఆకులు రాలిపోయాయి. ఈ మునగ కాయలు రావలసి ఉంది. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

-చాంద్ బాషా, వంగిమళ్ళ కస్పా

శిక్షా సప్తాహ్‌ను తనిఖీ చేసిన డిఇఒ



గాలివీడు: విద్యార్థులు సేకరించిన బోధన సామగ్రిని పరిశీలిస్తున్న డిఇఒ

ప్రజాశక్తి-గాలివీడు

ప్రభుత్వ పాఠశాలలో జులై 22 నుంచి 29 వరకు శిక్షా సప్తాహ్ రోజువారి కార్యక్రమాలలో భాగంగా మొదటిరోజు స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శనను డిఇఒ ప్రకాశ్ రెడ్డి తనిఖీ చేశారు. మండలానికి వచ్చిన డిఇఒ గేటు వద్ద వున్న ఉర్దూ పాఠశాల, బాలుర ఉన్నత పాఠశాలలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థుల తరగతులను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వనరులతో బోధనా సామగ్రి ప్రదర్శనను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. రాస్తున్న ప్లాకార్డులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిఆర్‌పిలతో సమావేశ ఏర్పాటు చేసి, పిల్లలకు విద్యా బోధన, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. బాలికల ఉన్నత పాటశాలలో నాన్ టిచింగ్ స్టాప్ లేక సమ స్యసగావుందని డిఇఒ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంఇఒలు నాగరాజు, శ్రీనివాసులు, సిఆర్‌పి సాంబశివ, డేటా ఎంట్రీ ఆపరేటర్ నరసింహారెడ్డి, కెజిబివి ఎస్ఒ నీరజ పాల్గొన్నారు.

రెండవ రోజు..

పుల్లంపేట : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అనంతపల్లిలో మంగళవారం ఎంఇఒలు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు ఆధ్వర్యంలో శిక్ష సప్తాహ్ కార్యక్రమం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో రెండవ రోజు ఎఫ్ఎల్ఎన్ గురించి ప్రతిజ్ఞ, ఆటలు కృత్యాలలో పిల్లలను నిమగ్నం చేయడం, కథ చెప్పడంలో మెలకువలు, బొమ్మలు ఆటల ద్వారా అభ్యసనం, ఎఫ్ఎల్ఎన్‌కు సంబంధించిన వీడియోలను ప్రదర్శించడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు కమ్యూనిటీని పాఠశాల కచ్చితంగా ఆహ్వానించడం సమావేశ ఫొటోలు, వీడియోలను మండల గ్రూప్‌లో షేర్ చేయడం, జిల్లా ఉప విద్యాధికారులు డివిజన్ స్థాయిలో, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు స్థాయిలో, నియోజకవర్గ, మండల స్థాయిలో పాఠశాల సముదాయ ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ స్థాయిలో రెండు లేదా మూడు పాఠశాలలో విధిగా కార్యక్రమాలకు హాజరై ముందు పరిచయం ట్రాకర్‌లె ఫోటోలు, వీడియోలను పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జయ లక్ష్మమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పుల్లంపేట: ఎఫ్ఎల్ఎన్ ఆకారంలో విద్యార్థులు

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి



పశ వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పశువులలో కనిపించే సీజనల్ వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని మదనపల్లి ఏరియా పశు వైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కే.రోహిణి అన్నారు. మంగళవారం కొండయ్యగారిపల్లె పంచాయతీలోని వెంకోజిగారిపల్లెలో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్‌తో కలిసి ప్రత్యేక పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పాడి రైతులకు పశువుల పెంపకం, పశువులకు అందించే పశుగ్రాసం, దాణా, పశువులలో కనిపించే సాధారణ వ్యాధి లక్షణాల గుర్తింపు, పాల ఉత్పత్తి, లేగ దూడల పెంపకం వంటి వాటిపై అవగాహన కల్పించారు. పశువైద్య శిబిరం ద్వారా పశువులకు డివామింగ్ మెడిసిన్‌ను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాడి రైతులు పశువులను పెంచుకుంటూ వాటి ద్వారా అందే పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. వాతావరణంలో మార్పులు వల్ల కాలానుగుణంగా పశువులలో కొన్ని రకాల వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. పాడి రైతులు కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే వేల రూపాయలు విలువైన పశువులను వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ముఖ్యంగా పశువులకు అందించే ఎండు గడ్డి నాణ్యతగా ఉండాలని అన్నారు. ఎండు గడ్డి కుళ్ళినా, తేమశాతంతో ముగ్గు వాసన వస్తున్న అటువంటి గడ్డిని పశువులకు మేతగా అందించరాదని సూచించారు. కలుషిత గడ్డిని పశువులకు మేతగా అందిస్తే పశువులు జబ్బుల బారిన పడి, అనారోగ్యం నశించి మృతి చెందుతాయని పేర్కొన్నారు. పశువులలో కొద్దిపాటి అనారోగ్య సమస్యలను గుర్తించినా వెంటనే పశు వైద్యాధికారులకు తెలియజేయాలని అన్నారు. తరచూ పశువులకు డి వామింగ్ చేసుకోవాలని సూచించారు. పశువులను ఉంచే పాక పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. కార్య క్రమం లో పశు వైద్యాధికారి డాక్టర్ సురేష్, సిబ్బంది శిరీష, హరి, పాడి రైతులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు : ఎంపిడిఒ



తంబళ్లపల్లి : పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్లు తెలిపారు. మంగళవారం పారిశుధ్య పక్షోత్సవకార్యక్రమంలో భాగంగా ఈనెల 22 నుంచి ఆగస్టు వ తేదీ వరకు మండలంలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో కాలువలు శుభ్రపరచుట, ట్యాంక్ క్లీనింగ్ చేసి బ్లీచింగ్ కలుపుట, పైప్ లైన్ల లీకేజీ మరమ్మతులు వంటి పారిశుధ్య కార్యక్రమాలను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ పక్షోత్సవాల్లో అన్ని గ్రామ పంచాయతీలు ప్రతిరోజూ పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టి డయేరియా ,మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడకుండా ప్రజలందరూ శ్రద్ధ వహించాలని తెలిపారు. పంచాలమర్రి గ్రామపంచాయతీలో ఇఒఆర్‌డి దిలీప్ కుమార్, పంచాయతీ కార్యదర్శి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పారిశుధ్యం పై ఇంటింటికి వెళ్లి అవ గాహన కల్పించారు. **గాలివీడు:** సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలు గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని ఇఒపిఆర్‌డి శేఖర్ నాయక్ పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచ్‌లు పంచాయతీ కార్యదర్శులు సచివాల కార్యదర్శిల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పారిశుధ్య పంచాయతీగా పుల్లంపేట

పుల్లంపేట : పుల్లంపేట పంచాయతీలో స్థానిక సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య ఆధ్వర్యంలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు చెత్తను తొలగించడం, వీధుల్లో బ్లీచింగ్ పౌడర్, సున్నం చెల్లించడం, మురుగునీరు తొలగించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. తొలగించిన చెత్తను పంచాయతీ చెత్త వ్యాన్ ద్వారా ఊరి బయటకు తరలించినట్లు తెలిపారు. శీతాకాలం కావడం చేత నెమ్ము వాతావరణ పరిస్థితులు ఉండడం వలన ఈగలు, దోమలు అధి కమై వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందువలన ముందస్తు జాగ్రత్తలు తీసు కున్న ట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే అన్ని రం గాలలో అభివృద్ధిని సాధించగలుగుతారని అన్నారు. ఇంటి ముందు మురుగు, నీటి నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు. పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా అభ్యర్థుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి-కలికిరి : మహాత్మా జ్యోతిభా పూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయుల భర్తీ కొరకు నోటిఫికేషన్ విడుదల చేస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిజిటి (ఫిజికల్ సైన్స్) పోస్ట్‌కుగాను, ఎంఎస్‌సి (ఫిజిక్స్) 50శాతం మార్కులతో ఏదైనా యూనివర్సిటీ నుంచి రెగ్యులర్ పద్ధతిలో పూర్తిచేసి బిఎడ్. (ఫిజిక్స్) మెథడాలజీ చదివిన వారు అర్హులన్నారు. పిజిటి (ఇంగ్లీష్) పోస్ట్ నకు గాను ఎం.ఎ(ఇంగ్లీష్) 50శాతం మార్కులతో ఏదైనా యూనివర్సిటీ నుండి రెగ్యులర్ పద్ధతిలో పూర్తి చేసి బి.ఎడ్ (సోషియల్/ఇంగ్లీష్) మెథడాలజీ చదివినవారు అర్హులని అన్నారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన అనుభవం ఉన్న వారికి, 3 స్థాయిల్లో చదివిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. దరఖాస్తు చేయదలచిన మహిళా అభ్యర్థులు ఈ నెల 30వ తేది సాయంత్రం 4గంటల లోపల కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రక్కన నిర్వహించబడుతున్న బిసి సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో దరఖాస్తులను అందించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెలుగు ఎపిఎం ఖాదర్‌వలీ

సబ్సిడీ రుణాలు అందిస్తాం

ప్రజాశక్తి-వీరబల్లి

జీవనోపాదులకు బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తామని ఎపియం ఖాదర్‌వలి అన్నారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడాతూ ఆసక్తి గల సభ్యులకు జీవనోపాదులకు లక్ష రూపాయల నుంచి ఐదు లక్షల వరకు 35శాతం సబ్సిడీతో రుణాలు అందిస్తామని చెప్పారు.యూనిట్ విలువను బట్టి రుణం వస్తుందని, బాంక్ రుణాలు క్రమం తప్పక చెల్లించే సంఘాలకు పది లక్షల వరకు వడ్డీ రాయితీ వస్తుందన్నారు. కార్యక్రమంలో సిసిలు కృష్ణయ్య, నాగేంద్ర, సుభద్రమ్మ, కుల్లాయప్ప, సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి గులాబ్ జాన్, కోశాధికారి వారాధమ్మ, అకౌంట్లు రాజు, మరియమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బద్వేల్‌కు సహకరించాలి

- మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ

ప్రజాశక్తి - బద్వేలు : స్వచ్ఛ బద్వేల్ మున్సిపాలిటీకి ప్రజలందరూ సహకరించాలని, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం బద్వేల్ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పచ్చదనానికి ఒక మొక్కను నాటాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ స్వచ్ఛ బద్వేల్ మున్సిపాలిటీకి సహకరించాలని కోరారు. బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, హోటళ్లల్లో కేన్సర్ కారకాలైన టెస్టింగ్ సాల్ట్, ఫుడ్ కలర్స్ వినియోగించరాదని, నాణ్యతగల ముడిసరుకులనే వినియోగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, దీనిపై పాత్రికేయులు కూడా పత్రికలలో ప్రచురించి ప్రజలకు మరింత అవగాహన కలిగించాలని కోరారు. బ్రహ్మాసాగర్‌లో నీటి కొరత ఉన్నందున నీటి సరఫరాలో జాప్యం జరుగుతుందని, ఎగువన వర్షాలు పడుతున్నందున శ్రీశైలం డ్యాం నిండిన వెంటనే బ్రహ్మాసాగర్ కు నీరు వదులుతారని తెలిపారు. డెంగీ వ్యాధి నివారణకు పాత టైర్లు, పూల కుండీలలో నిల్వ ఉండే నీటిని పారవేయాలన్నారు. ప్రతి ఒక్కరూ నీటిని వృథా చేయరాదని సూచించారు. ఆసక్తి గల వారికి మున్సిపాలిటీ కార్యాలయంలో మొక్కలు ఉచితంగా అందజేసే కార్యక్రమం ప్రారంభిస్తున్నామని తెలిపారు. గుంతపల్లి, కోటవీధి, గాంధీనగర్, మడకలవారిపల్లె లలో ఉచిత ఆధార్ సెంటర్లను ఈనెల 23 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నామని, ఆధార్ కార్డులో ఏవైనా తప్పులుంటే ఉచితంగా సవరణ చేసుకునేందుకు ఇది ఒక అవకాశం అని తెలిపారు. వీధులలోకి సకాలంలో చెత్త బండ్లు రాకపోయినా తడి చెత్తను ఒక సంచిలో ఉంచి చెత్త బండి వచ్చినప్పుడు వాటిలో వేయాలని, రోడ్లపై వేయరాదని సూచించారు. ప్రజలకు ఏదైనా సమస్యలు ఉంటే తనకు తెలపాలన్నారు.

ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - కడప : మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని రిటైర్డ్ హెల్త్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ గుణశేఖర్, స్టెప్ సిఇఒ సి. సాయి గ్రేస్ అన్నారు. మంగళవారం జిల్లా యువజన సర్వీసుల శాఖ (స్టెప్) ఆధ్వర్యంలో పెండ్లిమర్రి మండలం, నంది మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల లో 'వ్యక్తిత్వ వికాసం- కెరీర్ కౌన్సెలింగ్" పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువు, కళలు, క్రీడలు పట్ల ఏకాగ్రత కలిగి మంచి ఉన్నత స్థితికి ఎదగాలని ఆకాంక్షించారు. దేశ జనాభాలో యువత 33 శాతం ఉందని, ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదని తెలుపుతూ, యువజన సర్వీసుల శాఖ వారు స్టెప్ ద్వారా యువతకు వ్యక్తిత్వ వికాసంతో పాటు కళలు, క్రీడలు, దిశా యాప్ మొదలగు వాటి గురించి అవగాహన కార్యక్రమాలు వివిధ కళాశాలల నందు విరివిగా నిర్వహిస్తునామని తెలిపారు. అనంతరం ఇరు పాఠశాలల హెడ్ మాస్టర్లు వెంకట సుబ్బయ్య, కె. ప్రసాద్ రావ్ గారు మాట్లాడుతూ అవగాహన సదస్సు తమ పాఠశాలలలో నిర్వహించడం సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో ఇరు పాఠశాలల విధ్యార్థిని విద్యార్థులు దాదాపు 300 మందితో పాటు పాఠశాలల అధ్యాపకులు, స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బరాయుడు, జూనియర్ అసిస్టెంట్ వి.వి. నారాయణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రెండు బైక్‌లు ఢీ : విద్యార్థి మృతి

ప్రజాశక్తి-కలికిరి



మనోజ్ కుమార్ (ఫైల్ ఫొటో)

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని గుట్టపాలెం కస్పాకు చెందిన భత్తల భాస్కర కుమారుడు మనోజ్‌కుమార్(17) శ్రీనివాస కాలేజీలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం కాలేజీ నుంచి ఇంటికి వచ్చి ద్విచక్ర వాహనంలో గుట్టపాలెం నుంచి జంగంపల్లి మీదుగా కుమ్మర పల్లికి వెళుతూ ఓ మలుపు వద్ద ఎదురుగా వస్తున్న జంగంపల్లికి చెందిన వెంకటరమణ వాహనాన్ని వేగంగా ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. వీరిద్దరని ఆటోలో కలికిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి పీలేరు ఏరియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. పీలేరు ఆసుపత్రికి ఇద్దరినీ 108 లో తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మనోజ్ పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మనోజ్ కుమార్ మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనతో తల్లిదండ్రులతో పాటు గుట్ట పాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

ప్రరజాశక్తి-సుండుపల్లి



ఆనంద్(ఫైల్ ఫొటో)

భార్యను హత్యచేసిన ఘటనలో మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీ పెద్దపల్లికి చెందిన నంద్యాల ఆనంద్(42)కు ఐదవ అదనపు జిల్లా జడ్జి కృష్ణన్‌కుట్టి జీవిత ఖైదు విధించారు. కోర్టు కానిస్టేబుల్ ఈశ్వర్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో పెద్దపల్లికి చెందిన నంద్యాల ఆనంద్ భార్య ధనలక్ష్మి జీవన ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లారని తెలిపారు. ఆనంద కూడా కొంత కాలానికి జీవన ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లినట్లు తెలిపారు. అక్కడ తన భార్య వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలుసుకొని తన భార్యను ఇండియాకు పోదామని నమ్మించి 2004వ సంవ త్సరంలో తన ఊరికి సమీపంలోనే రాత్రి సమయంలో అతి కిరాతకంగా కొట్టి హత్య చేశాడని తెలిపారు. అక్కడే ఆ వంకలోని పూడ్చిపెట్టి ఎవరికి తెలియకుండా తిరిగి కువైట్‌కి ఆనందం వెళ్లిపోయాడని తెలిపారు. ధనలక్ష్మి అమ్మ పోకల చిన్నక్క తన కుమార్తె కువైట్లో లేదని తెలుసుకొని 2007వ సంవత్సరంలో పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ ఎం.వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారని తెలిపారు. 2007లో ఆనంద్ తిరిగి ఇండియాకు రావడంతో పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలి పారు. అప్పుడు నుంచి నేటి వరకు వాయిదాలు పడటంతో మంగళవారం రాయ చోటి అదనపు కోర్టు జిల్లా కోర్టు జడ్జి కృష్ణన్ కుట్టి జీవిత ఖైదీతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారని తెలిపారు.

నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల కేంద్రానికి దగ్గరలో ఉన్నటువంటి వంకలో గుబురు చెట్ల మధ్య రెడ్డిభాషా చెక్ డ్యాం దగ్గర మంగళవారం పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అధీనంలోకి తీసుకొని వారి వద్దనున్న రూ.11060 లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.